కథ

# స్పెల్లింగ్ మిస్టేక్

**"పేరేంటి?" తేరిపార చూస్తూ అడిగాను.**

**"అవసరమా?" కనుబొమలు పైకెత్తి వెటకారంతో తిరస్కరిస్తున్నట్లు అంది.**

**"పరిచయం చేసుకోవడం తప్పంటారా?"**

**నా బహువచన సంబోధన తనని ఆశ్చర్యపోయేలా చేసింది. నిజంగా అందగత్తే! కనుముక్కు తీరు, ఒంపుసొంపుల జోరు ఏ మగాడినైనా కట్టిపడేస్తాయి.**

''....మీ పేరు తపతి. కానీ అది అసలు పేరు కాదు. మీరిక్కడికొచ్చి సంవత్సరం దాటుతోంది. మీరంటే చాలా మంది ఇష్టపడతారు. లోకం ఏమన్నా మీరేం పట్టించుకోరు. డబ్బంటారా..అదే వచ్చి వాలుతుంది'' అంటూ ఆగాను.

ఆ కళ్ళలో నమ్మలేనితనం కొట్టొచ్చినట్లు కనబడుతోంది.

''మీకివన్నీ..ఎలా తెల్సు?'' అంది.

''అవసరమా?'' అదే దెబ్బ. అదే చోట.

క్షణాలు కదలాలా వద్దా అన్నట్లు భారంగా జరుగుతున్నాయి.

''నేను మీపై కోరికతో రాలేదు. ఆసక్తితో వచ్చాను. నేనలాంటి వాడిని కాను కూడా! మీ గూర్చి విషయమంతా కావాలి. చెప్పండి'' అన్నాను.

ఆశ్చర్యం స్థాయిని దాటిపోయింది. అలాగే చూస్తోంది ఇంకా!

''నా పేరు శశాంక్-రచయితను. మీ జీవితాన్ని కథగా రాయాలనుకుంటున్నా. దయచేసి చెప్పండి''

''.....''

''ఏంటీ! ఇష్టం లేదా!?'' అడిగాను సూటిగా చూస్తూ.

''నాకంటూ ఏం ఉందని చెప్పమంటారు? ఈ రక్తమాంసాల శరీరం, అది పనిచేయడానికే ఓ ప్రాణం... అంతే తప్ప నాకేం లేదు. అసలు నేనే లేను''

గద్గద స్వరం..గంభీరంగా! ఖిన్నుడ్ని చేసింది.

ఇంకేం అడగలేకపోయా. అలాగే రెప్పవేయడం మరిచి నిలుచున్నాను.

''ప్రాణమొక్కటే కావచ్చు. కానీ నాకు చాలా జన్మలున్నాయి. ఈ జన్మ పేరు తపతి'' చెప్పడం ప్రారంభించినట్లు తెలియగానే పాకెట్ టేప్ రికార్డర్ ఆన్ చేశాను.

★ ★ ★

''ఆడాళ్ళు ఇలా కూడా ఉంటారా శశీ..'' కళ్ళను కన్నీరు ఆక్రమించి కంటిరెప్పలకంటుకుంది హరిణికి.

ఏం చెప్పాలో తోచలేదు నాకప్పుడు. తను అమ్మాయై ఉండి కూడా ఆడవాళ్ళు ఇలా ఉంటారా అని అడగడం...

ఎందుకో-నాకు మాటలు రానట్లే-చూపులతోనే సరిపెట్టుకుంటున్నా.

భుజంపై చెయ్యి వేసింది. ఆ స్పర్శ, ఆర్ద్రత గుండెకు పాకింది.

''నాకు తనని చూడాలనిపిస్తోంది. తీసికెళ్ళవూ..'' బతిమాలుతున్నట్లుగా ముఖం పెట్టి అడుగుతోంది.

''అక్కడ ఉందో లేదో- అయినా అలాంటి చోటుకు నిన్ను తీసుకెళ్ళడం బాగోదు. ఎందుకంతగా స్పందిస్తావ్!? టేకిట్ ఈజీ!''

''ఎలా!? ఇదేమైనా మామూలు విషయమా..నువ్వు మాత్రం అంతా తెల్సుకుని నన్నేమో ఒదిలేయమంటావా..'' దూరంగా జరిగి తలనలా తిప్పుతూ బరువుగా అంటోంది.

అబ్బా! ఈ ఆడవాళ్ళు ఎప్పుడూ ఇంతే! ఏదో సరదాకి 'ఇలా కూడా ఉంటారు లోకంలో' అని ఒక ఉదాహరణ చెబితే- తను ఏకంగా ఆమె దగ్గరకే వెళ్తానంటోంది. పట్టుపడితే ఊరుకునే రకం కాదు. పెళ్ళైన రెండు నెలలకే తెల్సింది-మల్లెపూలు తేలేదని ఓ రోజు ఎంత రభస చేసిందీ! ఆలోచనలో పడిపోయా.

''ఎన్నాళ్ళయిందన్నావు తనను కల్సి?'' ముందు నిలబడి కనబడుతోంది.

''మన పెళ్ళికి సంవత్సరం ముందనుకుంటా'' చెప్పాను.

''అంటే..ఇప్పుడు సంవత్సరంన్నరైందన్న మాట..'' అని లెక్కలు కట్టి, ''ఉంటుంది కావచ్చు. ప్లీజ్ శశీ తీసుకుపోవూ..'' గెడ్డం పట్టుకుంది అమాయకంగా అడుగుతూ.

''ఓ.కె. ఓ.కె. బట్ వన్ కండిషన్. నేను మొదట వెళ్ళి ఉందేమో చూసి వస్తా..'' అన్నాను కనుబొమలు పైకెత్తి.

ఒక్క క్షణం ఆలోచించి ''అలాగే'' అంది హరిణి.

ఆమె 'జీవితా'న్ని కథగా మలచి దానికి మొదటి బహుమతి అందుకుని చాలా రోజులు గడుస్తున్నా- ఆ కథ అలాగే నా చుట్టే తిరుగుతోంది. ఆమె ప్రతీ మాటా నా చెవుల్లో రింగురుమంటోంది. 'ఆమె' నా కళ్ళల్లో ఇంకా కనబడుతూనే ఉంది. ఆమెలో ఆకర్షణ, ఆమె జీవితంలోని సంఘర్షణ.. ఏ మనసున్న మనిషినైనా ఆపి, ఆలోచింపజేస్తాయి. ఎవరు ఏం పోగొట్టుకున్నారో తెలీదు-కానీ వెతుకుతూనే ఉంటారు. ఏమైనా దొరికిందాని చూస్తే కోల్పోయింది ఎక్కడో అయితే వెతుకులాట మరోచోట చేశానని చివరికి తెలుసుకుంటారు. ఎవరో కాదు మనమే! మనుషులమే!

★ ★ ★

''...ప్రాణమొక్కటే కావచ్చు. కానీ నాకు చాలా జన్మలున్నాయి. ఈ జన్మ పేరు తపతి. ఆడపిల్లలంటే అసహ్యించుకునే ఆ ఇంట్లో నేను మూడో అమ్మాయిని, చిన్నదాన్ని. నా తర్వాత గారాల పట్టి తమ్ముడు.

కుటుంబంలో అంతమంది ఉన్నా నేనొంటరిగానే పెరుగుతున్నానని పెద్దవుతున్న కొద్దీ తెలిసింది. అమ్మా నాన్నా, ఇద్దరక్కలు ప్రేమనంతా తమ్మునిపైనే కుమ్మరించేవారు. నాపై తిట్ల వర్షం. తడవడం అలవాటైంది. వణకడం తప్పనిసరైంది. ఇదంతా బతుకులో భాగమే!


వయసు జమవుతున్న కొద్దీ నా అందం అపురూపమై కనిపించసాగింది. ఇద్దరక్కలు నన్నే ఈర్ష్యగా చూసేవారు. కావాలని కష్టపెట్టేవారు.

సొంత ఇంటిలో పరాయిదానిలా, అందరూ ఉండీ ఏమీ లేని, అంతా ఉండీ ఎవరూ లేని దాన్నయ్యాను. మనుషులకు ఆహారంతోపాటు ఆప్యాయత కూడా అవసరమే. ఆ అవసరం నాకు వ్యర్థమనుకున్నట్లుగా... నా కుటుంబం.

కొన్నాళ్ళకి ఇద్దరక్కలు అత్తారింటికి వెళ్ళారు. ఒకరి తర్వాత ఒకరుగా నన్ను దాటి బలవంతంగా. నాన్న ఆస్తి హారతి కర్పూరం అయింది. తమ్ముని చదువు ఇటు నా చదువు. ఒక్కోసారి నా బతుకు జడివానలో జాజుల మాదిరి కనబడేది.

ఒక తీయని పిలుపు లేదు. ఓ చల్లని స్పర్శ లేదు. ఒక ధైర్యపు మాటలేదు. అయినా నేను అందంగా, ఆకర్షణీయంగా పెరుగుతూనే ఉన్నా. ఎవరు మెచ్చుకుంటారాని, ఎవరు నన్ను తలనిమిరి బుగ్గనొక్కుతారా అని చిన్నప్పుడు ఎంతగా ఎదురు చూసే దాన్నో! ఒక్కరు నా ఉనికిని పట్టించుకునే వారు కాదు- అయినా నేను పెద్ద దాన్నైపోయాను.

తమ్ముడి ఇంజ



నీరింగ్ చదువుకు నాకని చేయించిన చేతిగాజులు, బంగారు గొలుసు, చెవి జూకాలు నా అనుమతి లేకుండానే నాన్న అమ్మేయడం... నాకు ఏడుపు తెప్పించింది. పండక్కి నాకు కొనే బట్టల ఖర్చు తమ్ముడి పాకెట్ మనీ అయినప్పుడు కన్నీరు నన్ను మేఘంగా మార్చింది. అమ్మ కూడా నాన్నలాగేనని తెలిశాక నాకు ఇల్లంటే..ఇష్టం పోయింది.

ఆప్యాయత కోసం అలమటిస్తూ రోజులు మరిచి పందొమ్మిదేళ్ళుగా బ్రతుకుతూంటే- ''నువ్వంటే నా కిష్టం..'' అని అతడు నా ఎదురుగుండా నిలబడి ఆ రోజు చెప్పినప్పుడు పుస్తకాలు నేల రాలాయి. గుండె గుప్పిట పట్టుకుని ఊపిరి మరిచి కళ్ళు అలాగే తెరిచి చూస్తూండిపోయా. రెండో రోజు..అదే మాట. కానీ నా ప్రతిస్పందన చిరునవ్వయింది. ఆ రోజు నా నిద్ర కరువైంది. మూడో రోజు ఆ 'మాట'కోసం ఎదురు చూశాను.

మాట

కాదు చేతికి 'వాచ్' కొనుక్కొచ్చాడు.

అది ప్రేమట. నేను అవుననాలట.

అంటే ముల్లేం పోతుందని ''ఊ'' అన్నాను. ఊపిరాపి.

పందొమ్మిది సంవత్సరాల పరువం, ఓ రోజు

**సుగంధ శ్రీనివాస్**

మనసు

వద్దని వారిస్తున్నా మరోసారి ''ఊ'' అంది- 'ఊహు' అనే బదులు. తర్వాత తెల్సింది నేనేం తప్పు చేశానో!? తను కనబరిచిన ప్రేమ, ఒలకబోసిన అనురాగం, కలబోసిన ముద్దుమా

టలు.. అంత వరకు తెలియని తనువు తహ తహ.. నిజంగా నాకప్పటి వరకు తెలీదు జీవితం ఇంత మధురంగా, మత్తుగా ఉంటుందని-

కొన్నాళ్ళకి తనెందుకో దూరం కాసాగాడు- నేను తట్టుకోలేకపోయా- జాబిలి ఎడబాటు కలువకి కలతల యాతనలా. జాబిలిలాగే తాను దూరంగా.

వెనవేసే ప్రేమకు అలవాటు పడిపోయా. ఎవరు మెచ్చుకుంటారా... ఎవరు అక్కున చేర్చుకుని కబుర్లు చెబుతారా.. ఎవరు నన్ను మురిపించి మరి పిస్తారాని.. డబ్బులకి కాదు, కానుకలకీ కాదు, కేవలం 'గుర్తింపు'కి, తెలియని దాహానికి అలా ఎదురు చూసేదాన్ని.

రోజులు అన్వేషణలో పడిపోయాయి. తాగిన కొద్దీ సముద్రపు నీరు దప్పిక తీర్చేబదులు ఇంకా పెంచుతుంది. నా పరిస్థితి అంతే అయింది.

నా వెతుకులాట బావలకి కూడా చేరినట్లుంది. దొరికిపోయా. దోచుకున్నారు. మెచ్చుకున్నారు. నిట్టూర్పుల చిరునవ్వొకటి, గెలిచానో ఓడానో మరి.

ఏ మగాడు నన్ను ఇష్టపడ్డా, నా పై ప్రశంసలు కురిపించినా నేను ఊ అనేదాన్ని, అలవాటైపోయింది.

ఇంట్లో నుండి పొమ్మన్నారు. వచ్చాను. కొన్నాళ్ళు ఒకతను రోజులుగా, నెలలుగా మబ్బుల్లోనే నిలబెట్టాడు. ఏమైందో చెప్పకుండానే చేయి వదిలేశాడు. నేలపై కూలిపోయాను. ఇదిగో ఇక్కడ చేరాను.

నన్నిక్కడ చూసిన వాళ్ళెవరూ కాదనరు. నేను వద్దనను. నాకెందుకో ఒక సాధారణ కార్యక్రమంగా అయిపోయింది. అమ్మలా పెంచాల్సిన కన్నతల్లి, నాన్నలా పెంచాల్సిన కన్నతండ్రి ఏమీ లేనట్లు. నేనేమి కానట్లు చూసేసరికి నా హృదయం వెలితిపోయింది. వెతుక్కుంటూ..వెతుక్కుంటూ ఇక్కడికొచ్చా.

తెల్సిందేమిటో తెలుసా. ఏదీ నిజం కాదని నేను భావించిన ప్రతి అనుభూతి కృత్రిమమే! ఇదెంత విడ్డూరం. నాకోసమే అని. నన్నెంత మంది ఇష్టపడుతున్నారని లెక్కలు వేసుకునేదాన్ని. కానీ వయసులో ఉన్న ఆడదాన్ని ఏ మగాడైనా ఇష్టపడతాడని చాలా ఆలస్యంగా తెల్సుకున్నా.

అయితేనేం ఈ ప్రయాణం ఆగ కూడదు కదా! తెల్సుకున్నవన్నీ ఆచరిద్దామంటే జీవితమేదీ? దిగవలసిన చోటు కాదని దిగాక తెల్సినా.. ఎక్కేందుకు ఆ బతుకు 'బండి' ఉంటుందా!

నా గూర్చి తెలుసుకున్న ప్రతి మనిషి ఒళ్ళు కొవ్వెక్కి, బరితెగించి కాకపోతే ఈ పనులేంటి అంటారు. కానీ నేను శారీరకంగా ఆ సుఖం కోసం చేయడం లేదు. నా మనసు కోసం శరీరం వాడుతున్నాను.

అనుభూతులు చెప్పుకోవడానికి ఏదీ నాకు 'అనుభవం' కాదు. అంతా కోల్పోతున్న ప్రతీసారీ ప్రేమ నేరుకునేదాన్ని- ప్రశంసలను జల్లుకునేదాన్ని. డబ్బులు అంటారా కేవలమని బ్రతకడానికే. ఒక్కోసారి అడిగినవారికి నేనే తిరిగి ఇచ్చేదాన్ని.

ఇప్పటికీ మీరు నా అందాన్ని పొగిడినా, నన్ను ప్రేమిస్తున్నానని, ఇష్టపడుతున్నానని చెప్పినా మీ కోసం ఈ దేహం సిద్ధంగా ఉంటుంది. ఇలా ఒకే ప్రాణంతో ఎన్నో జన్మలు మార్చాను. ఒకే దేహంతో ఎన్నోసార్లు చచ్చాను. ఇదే నా జీవితం. జీవితమనవచ్చా అంటే బ్రతికున్నాను కదా!

పాపాలు, పుణ్యాలు అంటే నాకు తెలీదు కానీ- నేను చేసేది ఏ పనో తెలుసుకుందామంటే చెప్పేవారెవ్వరు..?''

★ ★ ★

పూల తీగలాంటి ఆడపిల్ల ఆధారం కోసం వెంపర్లాడటం మన సమాజం నేర్పించిందే! ఎదుటనున్నది పందిరో, ముళ్ళకంచో తెలుసుకోకుండా అల్లుకుంటే చాలు అని. ఆధారపడకుండా ఆడది బ్రతకలేదని ప్రతి రక్తకణంలోనూ ఇంజెక్టు చేశారీ మనుషులు.

ఆలోచనలు తేనెటీగల్లా వెంటరాగా.. అక్కడికి చేరుకున్నాను. అదే ఇల్లు. తటపటాయిస్తూ నాలు గడుగులు వేశాను. ఒక పాప ఎదురొచ్చింది. తను లేదట.

ఇంటి గుమ్మం వరకూ వెళ్ళాను. ''ఇక్కడ తపతి అని ఒకావిడ ఉండేది?'' మాటలాగిపోయాయి.

అదోలా చూసిన ఆమె నోట్లో నుండి మాటలు పొడి పొడిగా వచ్చాయి.

''ఏమండీ! నేను రచయితను. ఆవిడ వివరాలు కాస్త చెబుతారా?'' మళ్ళీ అడిగాను.

ఇప్పుడు కళ్ళల్లో నమ్మకం కుదిరింది. ''కూర్చోండి'' అంటూ కుర్చీ చూపించింది.

''ఆవిడ ఇల్లు ఖాళీ చేసి ఆరు నెలలైంది. ఇంటి ఓనర్ వెళ్ళిపొమ్మన్నాడు. ఎక్కడ ఉంటోందో తెలీదుగానీ, బాగా జబ్బుపడి హాస్పిటల్‌లో జాయిన యిందని తెల్సింది. మరణానికి చేరువకాగానే తన కిడ్నీలు, కన్నులు తీసి ఎవరికైనా అమర్చమని బాండ్ రాసిచ్చిందిట. నెలరోజులు గడిచాయో లేదో-

ఆమె కోరిక మేరకు డ్యాక్టర్లు అపస్మారక స్థితిలో ఉన్న తనకి ఆపరేషన్ చేసి కిడ్నీలు, కన్నులు తీసి నలుగురికి అమర్చారు. అనాథ శవం కాకుండా హాస్పిటల్ యాజమాన్యమే అంత్యక్రియలు నిర్వహించింది. తనకోసం ఎవరైనా వస్తే.. వచ్చిన వారికి ఈ విషయం చెప్పి, ఫొటో ఇమ్మంది కూడా తన వాంగ్మూలంలో..''

గుండె బరువెక్కింది. మనసు తడిసిపోయింది. కన్నులు మసకబారుతుండగా లేచి నిలుచున్నాను దీర్ఘంగా శ్వాస వదులుతూ.

''హాస్పిటల్‌కి వెళ్ళండి. ఫొటో ఇస్తారు'' అందామె.

★ ★ ★

ఎంతగా కసి తీర్చుకుంది ఈ లోకంపై. చస్తూ కూడా ప్రశంసలూ, ప్రేమలు కోరుకుంటూ పోయింది. కన్నీళ్ళు రాల్చి తుది వీడ్కోలు చెప్పేందుకు ఎవరూ లేరని ఈ రకంగానైనా తనని అందరూ గుర్తుచేసుకుంటారని.. ఎంత పని చేసి పోయింది..తపతి!?

గెలవడానికి ఇంత త్యాగం చేయాలా? 'గుర్తింపు' కోసం ఎందుకింత తాపత్రయం?

అంతా చెప్పి ఫొటో ముందరేశాను. ఉత్సుకతతో ఫొటో చూసిన హరిణి నోరు తెరిచింది. ''అరే! ఇది మల్లిక, నా ఫ్రెండు..'' అంటూ ఏడుపు ముఖం పెట్టింది.

''కాలేజ్‌లో దాన్నందరూ విచిత్రంగా చూసేవారు తన ప్రవర్తనకి. కానీ వట్టి అమాయకురాలు'' అప్పుడే కన్నీళ్ళు తన కన్నుల్లో.

నా కళ్ళు చూస్తున్నాయన్నమాటేగానీ మనసెప్పుడో తలుపు మూసింది.

''పరిమళంతో ఎంతగా విరబూసినా మల్లెల్ని దేవుని దగ్గరకి తీసుకుపోరు. రాలడమో, దేహాగ్నికి కాలడమో?!'' ఓదారుస్తున్నట్లు అంటూ దగ్గరికి వెళ్ళాను.

''సారీ..శశీ! వెళ్ళకుండా ఉంటే బ్రతికే ఉందనే భావనలో ఉండేవాళ్ళం'' అంటూ నా చేతులు రెండూ పట్టుకుంది సజల నయనాలతో.

'అవును. నిజమే! వాస్తవంకన్నా ఊహ అందంగా, అద్భుతంగా, చిరకాలంగా ఉంటుంది' అనుకున్నాను.

♣

